క్లుప్తంగా

రోడ్డు మధ్య విద్యుత్ స్తంభంతో ఇబ్బందులు



జనగామ: పట్టణంలోని 3వ వార్డులో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభంతో రాక పోకలకు ఇబ్బంది తప్పడం లేదు. రాత్రి సమయంలో ద్విచక్రవాహనాలపై వచ్చే వారికి ప్రాణ సంకటంగా మారుతోంది. ఎన్పీడీసీఎల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పరామర్శ



జనగామ: పట్టణంలోని 11వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గుండు నగేష్ అనారోగ్య మృతి చెందాడు. కాగా, గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని ఓదార్చి, మృతదేహంపై పూలమా వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

రామవరంలో..



కొడకండ్ల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామవరం గ్రామానికి చెందిన మేటి శ్రావణ్, శివ కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలు వేసి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సింది రామోజీ, ఎంపీటీసీ మణెమ్మ, సోమరాములు, సతీష్‌గౌడ్, యాకూబ్, రణధీర్ తదితరులు ఉన్నారు.

దుర్గాప్రసాద్‌ను ఆదరించండి

జనగామ రూరల్: ధర్మసమాజ్ పార్టీ ఎమెల్సీ అభ్యర్థి బరిగెల దుర్గా ప్రసాద్‌ను పట్టభద్రులు ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు దుర్గాప్రసాద్ అనేక పోరాటాలు చేశారని, పట్టభద్రులు 11 నంబర్ గుర్తుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు. నాయకులు రవి, కిష్టయ్య, బాబు, ఉమా, నవీన్, ప్రశాంత్, పరుశురాం పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో 'సిగ్నల్' సమస్య



చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సెల్ ఫోన్ సిగ్నల్ లేక పోలీసులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరికి ఎన్ని సమస్యలు వచ్చినా తీర్చే పోలీసులకు స్టేషన్‌లో సిగ్నల్ సమస్య తీవ్రంగా ఉంది. నూతన మండల కేంద్రం ఏర్పడిన సమయంలో దేవాదాయ శాఖకు చెందిన సత్రాల్లో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ గుట్ట అడ్డుగా ఉండడంతో స్టేషన్‌కు ఫోన్ వస్తే చాలు ఎస్సైతోపాటు సిబ్బంది బయటకు వెళ్లి మాట్లాడాల్సిందే. ఇలా ప్రతీ రోజూ ఇదే తంతు కొనసాగుతోంది. 10 ఏళ్లు అవుతున్నా సిగ్నల్ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. గురువారం స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్‌కు ఫోన్ వచ్చినపుడల్లా ఇలా దేవాలయం సమీపంలోకి వచ్చి మాట్లాడారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఫోన్ సిగ్నల్ సమస్యను తీరుస్తారని పలువురు ఆశిస్తున్నారు.

కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పాలకుర్తి: మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన పెద్ది హర్షిణి, పెద్ది ఉజ్వల్‌లు షోటోకాన్ కరాటే, కటాస్ విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి విజేతగా నిలిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకున్నారు. ఈ నెల 19న గోవాలో యూనివర్సల్ 369 షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొని విజేతలుగా నిలిచారు. హర్షిణి వెపన్ కటాస్ విభాగంలో గోల్డ్, కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా ఉజ్వల్ వెపన్‌కటాస్‌లో మెడల్ సాధించారు. కాగా, గురువారం చిన్నారులను హీరో సుమన్‌తో కరాటే మాస్టర్లు, గ్రామస్తులు అభినందించారు.

రహదారికి పొంచిఉన్న ముప్పు

- కల్వర్టుకు అడ్డుగా మట్టి, బండరాళ్లు
- వరద ప్రవాహ వ్యవస్థను మూసి పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు
- పట్టించుకోని ప్రభుత్వ విభాగాలు



జాతీయ రహదారి కల్వర్టుకు అడ్డుగా వేసిన మట్టి, బండరాళ్లు



గత ఏడాది వరద ఉధృతిని పరిశీలిస్తున్న డీసీపీ సీతారాం (ఫైల్)

రఘునాథపల్లి: జాతీయ రహదారిలోని రఘునాథపల్లి సబ్‌స్టేషన్ సమీపంలోని కల్వర్టుకు అడ్డుగా మట్టి, బండరాళ్లు వేసి పెట్రోల్ బంక్ నిర్మాణం చేపట్టారు. వరద ప్రవాహ వ్యవస్థను మూసి వేయడంతో జాతీయ రహదారికి ప్రమాదం పొంచి ఉంది. బంక్ నిర్వాహకులు వరద కాల్వపై పైపులు కూడా వేయకుండా మట్టితో నింపి నిర్మాణం సామాగ్రి వాహనాల ద్వారా వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసుకున్నారు. వరద వెళ్లే అవకాశం లేకుండా భారీ ఎత్తున మట్టి, బండరాళ్లు వేసినా ప్రభుత్వ విభాగాల అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని ఖిలాషాపూర్ పటేల్ చెరువు, వెల్ది చెరువు మత్తడి నీరు.. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు వచ్చేందుకు ఇదే మార్గం కావడంతో ..భారీ వర్షం కురిస్తే జాతీయ రహదారికి ప్రమాదం పొంచి ఉంది. గత ఏడాదిలోనే వరద ఉధృతి పెరిగి జాతీయ రహదారిపై నుంచి నీరు వెళ్లడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. స్వయంగా జనగామ డీసీపీ సీతారాం అధికారులతో అక్కడికి చేరుకొని వరద నీరు సాఫీగా వెళ్లేలా తగు చర్యలు చేపట్టారు. ఇదే ప్రాంతంలో ఏకంగా కల్వర్టు ముందే భారీ ఎత్తున మట్టి, బండరాళ్లతో మూసినా అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడం అనుమానాలకు తావిస్తుంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కల్వర్టుకు అడ్డుగా మట్టి, బండరాళ్లతో నింపిన వారిపై తగు చర్యలు తీసుకొని వరద నీరు సాఫీగా వెళ్లేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గమ్మ తల్లికి పూజలు



గ్రామస్తులతో ఎమ్మెల్యే కడియం

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న దుర్గమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామస్తులు దుర్గమ్మ తల్లికి అంత్యంత భక్తిశ్రద్ధల మధ్య బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. నాయకులు కట్టా మనోజ్‌రెడ్డి, అన్నెబోయిన బిక్షపతి, మంచాల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, నాయకులు బొమ్మినేని పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యనాథస్వామి ఆలయంలో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారులోని ప్రసిద్ధ బైరవగుట్టలోని వైద్యనాథస్వామి దేవాలయంలో వైశాఖ పూర్ణిమ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, శివభక్తుడు భూనేటి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

లారీ లోడ్ చేశాక .. తడిసిన ధాన్యం బస్తాలు

- కోతకు ఒప్పుకుంటేనే తీసుకెళ్తానని మొండికేసిన వైనం
- ఖిలాషాపూర్ పీఏసీఎస్ కేంద్రం వద్ద రైతుల ఆందోళన
- అధికారుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



లారీలో తడిసిన ధాన్యం బస్తాలు, ఆందోళన చేస్తున్న రైతులు

రఘునాథపల్లి: లారీలో లోడ్ చేసిన ధాన్యం వర్షానికి తడవడంతో తీసుకెళ్లేది లేదని డ్రైవర్ మొండికేయడంతో మండలంలోని ఖిలాషాపూర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. తూకం పూర్తయ్యాక తమకు సంబంధం లేదని, లోడ్ చేశాక టార్పాలిన్ కప్పుకోకకోవడం మీ తప్పంటు వాగ్వాదానికి దిగారు. అధికారులు జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఖిలాషాపూర్ పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం రాత్రి తూకం పూర్తయిన ధాన్యం బస్తాలను హమాలీలు లారీలో లోడ్ చేశారు. లారీని అక్కడే ఉంచి టార్పాలిన్ కప్పక పోవడంతో రాత్రి కురిసిన భారీ వర్షానికి లోడ్ చేసిన బస్తాలు తడిచాయి. లారీ డ్రైవర్ మిల్లు యజమానికి సమాచారమివ్వగా తడిసిన ధాన్యం తీసుకునేందుకు నిరాకరించారు. బస్తాకు రెండు కేజీల కటింగ్‌కు ఒప్పుకుంటే మిల్లుకు తీసుకరావాలని మిల్లు యజమాని హుకుం జారీ చేశాడు. దీంతో రైతులు ధాగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ యుగేందర్, సివిల్ సప్లయ్ అధికారులు కొనుగోలు కేంద్రానికి చేరుకొని మిల్లు యజమానితో మాట్లాడి ఎలాంటి కోత లేకుండా ధాన్యం తీసుకెళ్లేలా ఒప్పించడంతో రైతులు శాంతించారు. ఆందోళనలో రైతులు రాపాక నాగరాజు, శివరాత్రి యాదగిరి, పెంతల మల్లయ్య, కుమార్, నాగయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రశ్నించే గళాన్ని మండలికి పంపాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం: బ్లాక్‌మెయిలర్ తీన్మార్ మల్లన్నను చిత్తుగా ఓడించి ప్రశ్నించే గళం బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డిని శాసనమండలికి పంపాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కోఆర్డినేటర్ సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. గురువారం రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని పాంనూర్, ఇప్పగూడెంలో, లింగాలఘణపురంలోని కుందారంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్ట భద్రులు విజ్ఞతతో ఆలోచించి ప్రశ్నించే గొంతుకైన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అందలం ఎక్కిందని, మళ్లీ మోసపోకుండా కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వై కుమార్ గౌడ్, మండల అధ్యక్షుడు వారాల రమేష్, కనకం గణేష్, తాటికొండ సురేష్, పాంనూర్, ఇనుగాల సంపత్‌రెడ్డి, ఎన్నకూస రాంనర్సయ్య, యాకన్న, రాంచందర్, భాగ్యలక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించండి

నర్మెట: ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పార్టీ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్ కోరారు. మండలకేంద్రంతో పాటు మచ్చుపహాడ్‌లలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌస్, మాజీ సర్పంచ్‌లు నీరటి రాణి సుధాకర్, రామిని శివరాజ్, లకావత్ కిరణ్, సీనియర్ నాయకులు రామలింగం, మేడబోయిన రాజు, రవి, వస్పారి రాజు, దశరథ్, బుడ్డా భాస్కర్, కోనేటి మల్లేషం, గట్టయ్య, బిచ్చు నాయక్, రాజశేఖర్, కొంపెల్లి రాజు, బొట్టు నాగేషం, రాజు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ మేకల కళింగ రాజు కోరారు. మండలంలోని శామీర్‌పేట గ్రామంలో పట్టభద్రులను ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉప్పలయ్య రామకృష్ణ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డిని ఆదరించండి

బచ్చన్నపేట: ఏనుగుల రాకేశ్‌రెడ్డిని పట్టభద్రులు ఆదరించి గెలిపించాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణా రెడ్డి కోరారు. మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నారు. మాజీ సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, నాయకులు కొండి వెంకట్‌రెడ్డి, సిద్దిరాంరెడ్డి, గోవర్దన్‌రెడ్డి, అనిల్, ఖైసర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ విజయం ఖాయం

దేవరుప్పుల: ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విజయం ఖాయమని పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అన్నారు. తొర్రూరులో తలపెట్టిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ఆధ్వర్యంలో మండల పట్టభద్రులు తరలివెళ్లారు. రాకేశ్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకాలని కోరారు. బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మాజీ ఎంపీపీ సోమన్న, కారుపోతుల భిక్షపతి, గొడుగు వేణు తదితరులు పాల్గొన్నారు.

డీడీల వాపస్‌కు దరఖాస్తు చేసుకోండి

లింగాలఘణపురం: ఉచిత గొర్రెల పంపిణీ పథకంలో డీడీలు తీసి యూనిట్లు రాని వారంతా వాపస్ తీసుకొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అనిత గురువారం ఒక ప్రకటనలో కోరారు. 75 శాతం సబ్సిడీపై 25 శాతం లబ్ధిదారుల వాటా ధనంగా చెల్లించిన రూ.43,750లు తీసుకొనేందుకు లబ్ధిదారుల ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు బుక్, యుటీఆర్‌నం రశీదు జిరాక్స్ ప్రతులను దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు. ఇప్పటికే ఆయా సొసైటీల అధ్యక్షులకు సమాచారం ఇవ్వడం జరిగిందని, వచ్చిన దరఖాస్తులను కలెక్టరేట్‌కు పంపించిన అనంతరం వారివారి అకౌంట్లలోనే డబ్బులు జమ అవుతాయని వివరించారు. ప్రస్తుతం ఉచిత గొర్రెల పథకం తాత్కాలికంగా నిలిపి వేయడంతో అవసరం ఉన్నవారంతా తీసుకోవచ్చని, తిరిగి ప్రభుత్వం పథకాన్ని కొనసాగిస్తే లబ్ధిదారులకు వర్తించే విధంగానే ఉంటుందని తెలిపారు. 14 నెలలుగా డీడీలు తీసి గొర్రెల కోసం ఎదురు చూసిన లబ్ధిదారులు ఇక డీడీలు తీసుకోవచ్చని చెప్పడంతో పథకంపై నిరాశలో పడ్డారు.

వసతులు కల్పించాలి



బచ్చన్నపేట: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాల వద్ద వసతులను కల్పించాలని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ రఘురామకృష్ణతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 1995 పట్టాభద్రుల ఓట్లు ఉన్నాయని, ఓటింగ్ కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, చక్రధర్, కారోబార్ బిట్ల అశోక్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని ధర్నా



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబం

జనగామ రూరల్: క్రాప్ లోన్ ఉండగానే ఎలాంటి ఆధారం లేకుండా భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు చిల్పూరు గ్రామానికి చెందిన బోళ్ల రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వారసత్వంగా వస్తున్న భూమి ఇతరులకు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తనపేర పట్టా చేసి ఇవ్వాలని బాధితుడు కోరారు.

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన



ఎంపీటీసీకి వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

రఘునాథపల్లి: మండలంలోని భానాజీపేట 9వ వార్డులో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని గురువారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. పైపులైన్ సరిగా వేయక పోవడంతో ఏళ్లుగా నీరు రావడం లేదని.. పలు మార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీకి చెందిన మహిళలు గ్రామ పంచాయతీ వద్ద నిరసన తెలిపారు. స్థానిక ఎంపీటీసీ రచ్చ సోమనాథ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీకి మహిళలు వినతి పత్రం అందజేశారు.

'తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం'



నర్మెట: ప్రచారం చేస్తున్న నాయకులు

నర్మెట/బచ్చన్నపేట/జఫర్‌గఢ్: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. నర్మెట, బచ్చన్నపేట, జఫర్‌గఢ్ మండల కేంద్రాల్లో వారు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపిస్తే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రచారంలో రాష్ట్ర యువ నాయకుడు నాగపురి కిరణ్ కుమార్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి, రాజబోయిన లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి భూక్య జయరాం, ప్రజ్ఞాపురం శ్రీధర్, దేవులపల్లి భాగ్యలక్ష్మి, బండి అశోక్, కర్రె నరేష్, గుర్రపు బాల్‌రాజు, అల్వాల ఎల్లయ్య పాల్గొన్నారు.

మల్లన్నకు టీయూటీఎఫ్ మద్దతు

జనగామ: ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు టీయూటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ సంఘు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుర్ర రమేష్ గౌడ్, నిమ్మ భగవాన్ రెడ్డిలు తెలిపారు. గురువారం బుర్ర రమేశ్ గౌడ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై గొంతెత్తి మాట్లాడే తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. టీయూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల వెంకటేశ్వర్లుగౌడ్, రాష్ట్ర కార్యదర్శులు లకావత్ ఈర్యా, రేణికుంట్ల మురళి, కేమిడి భాస్కర్, వివిధ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అజ్మీరా బీమా, లక్షణ్ గౌడ్ ఉన్నారు.

మల్లన్నను గెలిపించాలి

జనగామ రూరల్: సీపీఎం మద్దతు తెలిపిన తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బోట్ల శ్రవణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగు ప్రకాష్, బూడిద గోపి, అజారుద్దీన్, లింగం, వెంకటమల్లయ్య, పల్లెర్ల లలిత పాల్గొన్నారు.

బుద్ధుడి మార్గంలో పయనించాలి

జనగామ రూరల్: సమాజ హితం కోసం పాటుపడిన గౌతమ బుద్ధుడి మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ అన్నారు. గురువారం బుద్ధ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రాజు, రవీందర్, ఉదయ్‌కిరణ్, భాస్కర్,శ్యాం సన్, శ్రీనివాస్, ఆదామ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న విజయరామారావు

స్టేషన్‌ఘన్‌పూర్: నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ బలపర్చిన అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో జంటపట్టణాలైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామాల్లో గురువారం విస్తృత ప్రచారం చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ, బూర్ల విష్ణు, వంగ వేణు, రడపాక ప్రదీప్, గోనెల శ్రీనివాస్, మొగ్గుంపురం కిషోర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్

కొడకండ్ల: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి ఆస్పత్రి పరిసరాలను డీఎంహెచ్‌ఓ పరిశీలించి పాలకుర్తి సీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని సూచించారు. డాక్టర్ హరికృష్ణ, సీహెచ్‌ఓ దయాకర్, హెచ్‌వీ లలిత, రమేష్, రఘుపతి, స్రవంతి, మంజుల ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. గ్రామాల్లో చెత్తను ఆరు బయట పడవేయకూడదన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

విచారణ చేపట్టాలి

చిల్పూరు: నాణ్యతా లోపంతో నిర్మిస్తున్న డ్రెయినేజీని సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో ఇప్పటికి నాలుగు సార్లు కూలిందని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలోని ప్రధాన రోడ్డులో కూలిన డ్రెయినేజీని నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ చేపట్టిన పనులు నాణ్యతా లోపంతో ఉండటంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మళ్లీ కూలిందన్నారు. ఇప్పటికే డ్రెయినేజీ మూడుసార్లు కూలిందని, నాణ్యతతో కూడిన పనులు చేయాలని కోరారు. సంపత్ యాదవ్, శ్రీనివాస్, భీమన్న తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన అన్వర్ హుస్సేన్ ఇటీవల మృతి చెందారు. కాగా, గురువారం సామాజిక సేవాకర్త పోతుల రాములుయాదవ్ బాధిత కుటుంబీకులను పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. బుడిగరామచంద్రం, రేణికుంట సత్యనారాయణ, కొక్కలకొండ బాబు, లింగయ్య, వస్పరి నర్సింహులు, దొమ్మాట వెంకటేశం పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణం

రఘునాథపల్లి: మండలంలోని గోవర్దనగిరి గుట్టపై శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ఆలయ సన్నిదిలో ఉత్సవ మూర్తులకు అత్యంత భక్తి శ్రద్దలతో కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు గుట్టపై చేరుకొని స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేసి పాడి పంటలు చల్లంగా ఉండాలని మొక్కుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

జనగామ రూరల్: గూడ్స్ రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ రైల్వేస్టేషన్‌లో కాజీపేట వైపు వెళ్లే పట్టాలపై గురువారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ రమణారెడ్డి, సీహెచ్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట శాంతినగర్‌కు చెందిన డీజిల్ లోకోషెడ్ మెకానిక్ రౌతు దయాకర్ (47) మానసిక వేదనతో మద్యానికి బానిసై ఉదయం 9 గంటలకు గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల నుంచి దరఖాస్తు తీసుకున్న అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.


ఉపాధి హామీ పనులపై ఆడిట్ షురూ



కోలుకొండలో కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌పీ

దేవరుప్పుల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో వాస్తవికతను తెలుసుకునేందుకు ఏటా తలపెట్టిన సామాజిక తనిఖీలు గురువారం పలు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. 15వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి 28 వరకూ మండలంలోని 32 గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టిన అనంతరం 29న మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష ఉంటుందని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. 843 పనులకుగానూ రూ.6,22,93,938 నిధుల కేటాయింపులపై తనిఖీలు జరుగుతున్నాయి. ఈ మేరకు కోలుకొండ, చిన్నమడూరు, రామరాజుపల్లి గ్రామాల్లో కొనసాగిన పనులు తాలుకా నిర్దిష్ట ప్రదేశాలు, కూలీ వేతనాలపై రికార్డులను సరిపోలుస్తూ తనిఖీలు చేపట్టారు.

భగీరథ పైపులైన్ మరమ్మతులో నిర్లక్ష్యం



దేవరుప్పుల: మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారిలో యునైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట నెల రోజుల కిందట లీకేజైన భగీరథ పైపులైన్ మరమ్మతులు చేయడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారి గుండా స్థానిక కాలనీవాసులకు తాగునీటి సరఫరా అయ్యే పైపులైన్ లీకేజీకావడంతో స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది గుర్తించి మరమ్మతులు కోసం గోతి తీసిపెడితే లీకేజీ అవుతున్న నీటి నిల్వలతో నాచుపేరుకపోవడం సదరు పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యవైఖరికి అద్దం పడుతోంది.